## క్లుప్తంగా

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 8న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. జక్కలొద్ది, తిమ్మాపూర్, అల్లీపూర్ అగ్రికల్చర్ ఫీడర్, శివాలయం, గొల్లవాడ, ఉర్సు, సత్యసాయి నగర్, వినాయక నగర్, ఆర్‌టీవీ కార్యాలయం, టీచర్స్ కాలనీ, గవిచర్ల క్రాస్ రోడ్, 4వ బెటాలియన్, శేషాద్రి హిల్స్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### నేడు బీవీపీ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్

విద్యారణ్యపురి: భారత వికాస్ పరిషత్ (బీవీపీ) తెలంగాణ ప్రాంత రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను ఈనెల 8న హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించనున్నట్లు బీవీపీ ఓరుగల్లు శాఖ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వర్క్‌షాప్ కొనసాగనుందని పేర్కొన్నారు. బీవీపీ జిల్లా అధ్యక్షుడు సుధీర్‌కుమార్ అధ్యక్షతన జరగనున్న వర్క్‌షాప్‌లో ముఖ్యఅతిథిగా బీవీపీ దక్షిణ ప్రాంతీయ ప్రధాన కార్యదర్శి పురుషోత్తం శాస్త్రి, విశిష్ట అతిథిగా ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత సహ కార్యవాహ మల్లికార్జున్, ఆత్మీయ అతిథిగా బీవీపీ దక్షిణ ప్రాంతీయ సంయుక్త కార్యదర్శి నాగరాజు, బీవీపీ ప్రాంత అధ్యక్షుడు నాగేశ్వర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ, కోశాధికారి మాధవి పాల్గొంటారని సత్యనారాయణ తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో గతేడాదిలో బీవీపీ నిర్వహించిన వివిధ కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్ కార్యక్రమాలను రూపొందించుకోనున్నట్లు పేర్కొన్నారు.

### మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్‌గా రమేష్ బాధ్యతల స్వీకరణ



ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్‌గా బొల్లం రమేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఇక్కడ పనిచేసిన ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం సస్పెండ్ అయ్యారు. సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఉత్తర్వుల మేరకు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్‌గా రమేష్ బాధ్యతలు చేపట్టగా ఆయనను ఎస్సైలు శ్రీకాంత్, సురేష్, రైటర్ అచ్చ నరేందర్, సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని రుద్రమాంబనగర్‌కు చెందిన వేటూరి పారిజాతం, దేవేంద్రచారి దంపతుల రేకుల ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. ఈమేరకు బాధిత కుటుంబాన్ని శివనగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు పగడాల సతీష్ శనివారం పరామర్శించారు. అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు ఆదేశాలతో రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

### బీసీల అభివృద్ధిపై సెమినార్

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలో ప్రభుత్వ పదవీ విరమణ ఉద్యోగ సంఘం భవనంలో బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం వరంగల్, రాష్ట్ర ప్రభుత్వ పదవీ విరమణ ఉద్యోగుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో బీసీ సముదాయ అభివృద్ధి కార్యక్రమం శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాకనాటి చంద్రశేఖర్‌రావు హాజరై మాట్లాడారు. బీసీల అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం తక్షణమే 42శాతం రిజర్వేషన్ల అమలుకు బిల్లు ప్రవేశ పెట్టాలని, బీసీ జనాభా నిష్పత్తిని బట్టి నామినేటెడ్ కార్పొరేషన్ పోస్టులను బీసీలకు కేటాయించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కుమ్మరి మల్లేశం, మధుసూదన్, గుండు శ్రీరంగం, ముద్దసాని మల్లేశ్వరయ్య, ధర్మపురి రాజగోవిందు, మండల పరశురాములు పాల్గొన్నారు.

### రైల్వే నిబంధనలు పాటించాలి

ఖిలా వరంగల్: ప్రజలు రైల్వే నిబంధనలపై పాటించాలని జీఆర్పీ ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. రైళ్లు, రైల్వే ఆస్తుల ధ్వంసానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు వరంగల్ రైల్వే స్టేషన్‌లోని సమీప కాలనీలో ఆర్పీఎఫ్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. రైళ్లపై రాళ్లు రువ్వితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### విద్యార్థులకు అభినందనలు

ఐనవోలు: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)నకు ఎంపికైన మండలంలోని ఒంటిమామిడిపల్లి, పంథిని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు ఎంఈఓ పులి ఆనందం శనివారం అభినందనలు తెలిపారు. పంథిని పాఠశాల నుంచి ఐలపాక రోహిత్, అంగడి నందీశ్వర్, ఒంటిమామిడిపల్లి పాఠశాల నుంచి పి.రజినీప్రియ, ఆర్.వర్ష, పి.శ్రీచరణ్, ఎం.గౌతమ్, పి.సాత్విక్ ఎంపికయ్యారు.

# శ్వేతార్క సన్నిధి.. ఆకలి తీర్చే పెన్నిధి

- భక్తులకు నిత్యాన్నదానం
- సహకరిస్తున్న దాతలు
- శుచికి, రుచికి ప్రాధాన్యం



శ్వేతార్క ఆలయంలో భోజనం చేస్తున్న భక్తులు

కాజీపేట: కాజీపేట పట్టణంలో భక్తుల పాలిట కొంగు బంగారమై విలసిల్లుతున్న శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదంగా ఆకలి తీరుస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో గణపతి ఆలయాల్లో ఒక్కటైన శ్వేతార్కుడి క్షేత్రానికి నిత్యం సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. వారు స్వామి వారిని దర్శించుకున్న తర్వాత ఆలయం ఆవరణలోనే తిరుపతి తరహాలో భోజనం చేసేలా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సౌకర్యం ఏర్పాటు చేశారు.

**27 ఏళ్లుగా భక్తులకు అన్నదానం**

శ్వేతార్కుడిని దర్శించుకోవడం కోసం ఆలయానికి వచ్చే భక్తులకు స్వామి వారి ప్రసాదంగా ప్రతీ మంగళవారం భోజన రూపంలో అందించాలని ఆలయ వ్యవస్థాపకుడు అయినవోలు అనంత మల్లయ్య శర్మ సిద్ధాంతి నిర్ణయించి దాతల సహకారం కోరారు. అడిగిందే తడువుగా భక్తులు అనేక మంది ముందుకు రావడంతో క్రమం తప్పకుండా మంగళవారం భోజన ఏర్పాట్లను చేసి వడ్డిస్తున్నారు. ఆలయం ఆవరణలో ఇటీవల ప్రత్యేక వంటశాలతో పాటు భోజనశాల (అన్నపూర్ణ)ను నిర్మించారు. ప్రతిదినం ఆలయానికి వచ్చే భక్తులకు లేదనకుండా భోజన ఏర్పాట్లు చేయాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తీర్మానించడంతో ఇటీవల నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనేక మంది దాతల చేయూతనివ్వడానికి ముందుకు రావడంతో నిత్యాన్నదానంలో రోజుకు 200 మందికిపైగా భోజనాలు పెడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో భోజనాలు భక్తులకు లేదనకుండా పెడుతుంటారు. పండుగలు, ఉత్సవాల సమయంలో కూడా ఇక్కడ నిత్యాన్నదానం వందల సంఖ్యలో నిర్విరామంగా కొనసాగుతోంది.

**భోజనం చాలా బాగుంటుంది**



శ్వేతార్క క్షేత్రంలో చాలాచార్లు నిత్యాన్నదానంలో భోజనం చేశాను. ఇంట్లో తిన్న దానికన్న మిన్నగా ఉంటుంది. నాణ్యత ప్రమాణాలు పాటించి ప్రతీ వంటకం తయారు చేస్తారు. ఆలయ కార్యకర్తలు భోజనం తయారీ నుంచి భక్తులకు వడ్డించే వరకు అంకితభావంతో పనిచేస్తారు.

– దేవులపల్లి సదానందం, భక్తుడు, కాజీపేట

**దాతల చేయూతతో..**



గతంలో ఒక మంగళవారమే ఆలయంలో భక్తులకు అన్నదానం చేసేవాళ్లం. దాతల చేయూతతో ప్రతీనిత్యం ఆలయంలోని అన్నపూర్ణ భవనంలో ఉదయం, సాయంత్రం వేళల్లో అన్నదానం చేస్తున్నాం. పండుగలు, ఉత్సవాల సమయంలో టిఫిన్లు, భోజనాలను తీర్థ ప్రసాదాల రూపంలో అందిస్తున్నాం. భోజన సదుపాయాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలి.

– అయినవోలు రాధాకృష్ణ శర్మ, ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు

**రుచికరమైన భోజనం**

స్వామి వారి సన్నిధిలో పెట్టే భోజనం తినే భక్తులు అమృతం మాదిరిగా ఉందని, నాణ్యత ఎంతో బాగుందని కితాబు ఇస్తున్నారు. వంటలను ఎంతో జాగ్రత్తగా, రుచికరంగా తయారు చేసి భక్తులకు వడ్డిస్తుంటారు. వంటకాల్లో శుచి, శుభ్రతను పాటిస్తారు. రెండు, మూడు రకాల కూరలు, సాంబరు, పప్పు, నెయ్యి, పచ్చడి, పెరుగు, పొంగలి, పులిహోర తదితర రకాల వాటితో భోజనం పెడుతున్నారు. ఇక్కడ ఒకసారి భోజనం చేస్తే ఆ రుచిని ఎప్పటికీ మర్చిపోలేని విధంగా వంటలు ఉంటాయి. స్వామివారి దర్శనం మనస్ఫూర్తిగా చేసుకుని సంతృప్తి చెందిన భక్తులకు స్వామి వారి ప్రసాదం మరో తృప్తిని కలిగిస్తోంది.

## బూత్‌స్థాయి నుంచి పటిష్టం చేయాలి



మాట్లాడుతున్న ముత్తిరెడ్డి కేశవరెడ్డి

హసన్‌పర్తి: బూత్‌స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయాలని బీజేపీ వర్ధన్నపేట నియోజకవర్గ కన్వీనర్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి సూచించారు. 11ఏళ్ల మోదీ పాలన విజయంపై ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో శనివారం ప్రత్యేక వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ పాలనలో దేశం సాధించిన అభివృద్ధి – సంక్షేమ కార్యక్రమాలపై విశ్లేషించారు. బీజేపీ మండల అధ్యక్షుడు మారం తిరుపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మారపల్లి రాంచంద్రారెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు నాంపెల్లి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## యువ క్రీడాకారులకు స్ఫూర్తి



రాముకు జ్ఞాపిక అందజేస్తున్న బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్: చిన్న వయస్సులోనే జూడో అసోసియేషన్ రాష్ట్ర టెక్నికల్ చైర్మన్‌గా ఎంపికైన రాము.. యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని తెలంగాణ జూడో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బైరబోయిన కైలాస్‌యాదవ్ అన్నారు. ఈమేరకు వరంగల్‌లోని దేశాయిపేటకు చెందిన చందనగిరి రామును జూడో సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా కైలాస్‌యాదవ్ మాట్లాడుతూ సాధించాలన్న తపన, పట్టుదల, క్రమశిక్షణ ప్రతీ క్రీడాకారుడు అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ జూడో అసోసియేషన్ సెక్రటరీ ఎంఏ.అజీజ్, ఉపాధ్యక్షుడు డాక్టర్ రాంలక్ష్మణ్, జాయింట్ సెక్రటరీ దూపాకి సంతోష్, కోశాధికారి రవీందర్, సిద్దిపేట జూడో సంఘం కార్యదర్శి భరత్‌రెడ్డి, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, కోచ్‌లు పాల్గొన్నారు.

### యూరియా వాడకం తగ్గించాలి

వేలేరు: పంట సాగులో యూరియా వాడకం తగ్గించాలని శాస్త్రవేత జి.వీరన్న అన్నారు. మండలంలోని గుండ్లసాగర్‌లో శనివారం జరిగిన రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

## వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు..

- బీజేపీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు గడల కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ.రఫీ

ఖిలా వరంగల్: వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా కొనసాగిస్తున్నారని బీజేపీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్, ఎండీ.రఫీ తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆదేశాల ప్రకారం.. వరంగల్ శివనగర్‌లోని బీజేపీ మండల అధ్యక్షుడు మహమ్మద్ రఫీ అధ్యక్షతన బీజేపీ మండల సమావేశం శనివారం జరిగింది. ముఖ్యఅతిథులుగా వారు హాజరై మాట్లాడారు. ప్రధానిమంత్రి నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలనలో సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్ అనే ధ్యేయంతో ఎన్నో సంస్కరణలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. దేశానికి సేవచేయడమే బీజేపీ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కనుకుంట్ల రంజిత్, ఆడెపు వెంకటేష్, బైరి శ్యాంసుందర్, ఉషారాణి, సుంచు కేశవ్, జోగు మధుకుమార్, బొడకుంట్ల శివ, సురా శ్రీనివాస్, వైట్ల గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## శ్యామలరావు సంస్మరణ సభ



సంస్మరణ సభలో మాట్లాడుతున్న కోటేశ్వర్‌రావు

హన్మకొండ కల్చరల్: వరంగల్ కరీమాబాద్‌లోని మయూరి ఆర్ట్ క్రియేషన్స్ అధినేత, ప్రముఖ నటుడు దర్శకుడు, కళాకారుడు శతపతి శ్యామలరావు సంస్మరణ సభ శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా యేరా కోటేశ్వర్ రావు హాజరై శతపతి శ్యామలరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కళారంగానికి చేసిన సేవలను గుర్తుచేశారు. కార్యక్రమంలో 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్లి రవి, ఉపాధ్యక్షులు ఆకుతోట లక్ష్మణ్, శతపతి సామాన్ రావు, వేముల ప్రభాకర్, కుసుమ సుధాకర్, సాదుల సురేష్, కోడం సురేందర్, సాదుల సురేష్, చిదురాల మార్కండేయ, అల్లి కుమారస్వామి, రాగి వీర బ్రహ్మాచారి, శ్రీధరాచార్యులు, వనం లక్ష్మి కాంతారావు, బండారు ఉమామహేశ్వర్ రావు, మట్టెవాడ అజయ్‌కుమార్, కళాకారులు పాల్గొన్నారు.

## జూలై 7న ఎమ్మార్పీఎస్ వార్షికోత్సవం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నయీంనగర్: జూలై 7న ఎమ్మార్పీఎస్ 31వ వార్షికోత్సవాన్ని గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించాలని ఎమ్మెస్పీ నాయకులు కందుకూరి సోమన్న మాదిగ, సోమశేఖర్ మాదిగ పిలుపునిచ్చారు. నయీంనగర్‌లో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల హనుమకొండ మండల నాయకుల సమావేశం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో సోమన్న మాట్లాడుతూ మండల, గ్రామ స్థాయిలో ఎమ్మార్పీఎస్, దాని అనుబంధ సంఘాల నూతన కమిటీలను పూర్తి చేయాలని కోరారు. నెలరోజుల పాటు ఎమ్మార్పీఎస్ సంస్థాగత నిర్మాణం పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సుకుమార్ మాదిగ, రాజేష్ మాదిగ, సురేందర్ మాదిగ, రాజేందర్ మాదిగ, ఎర్ర రాము మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## వందపడకల ఆస్పత్రిగా ఏర్పాటు చేయాలి

ఎల్కతుర్తి: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకల ఆస్పత్రిగా ఏర్పాటు చేయాలని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్ జిల్లాలకు సరిహద్దు ప్రాంతంగా ఉన్న ఎల్కతుర్తిలో వందపడకల ఆస్పత్రిగా ఏర్పాటు చేయాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరందించాలని కోరారు. రబీలో దేవాదుల నీరు వదిలినప్పటికీ కాల్వలకు గండ్లు పడి నీరు వృథాగా పోయిందన్నారు. వరంగల్ ఎంజీఎం దూరంగా ఉండడం వల్ల ఎల్కతుర్తి మండలంతో పాటు వివిధ గ్రామాల ప్రజలకు ఎమర్జెన్సీ చికిత్స అందడం లేదని తెలిపారు.

## వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వాలి



సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ అధ్యక్షుడు పులి దేవేందర్, నాయకులు

హన్మకొండ: త్వరలో జరగనున్న మంత్రివర్గ విస్తరణలో ముదిరాజ్ బిడ్డ వాకిటి శ్రీహరి ముదిరాజ్‌కు మంత్రి పదవి ఇవ్వాలని ముదిరాజ్ ఎంప్లాయీస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ – తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్, సభ్యులు డిమాండ్ చేశారు. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలో రాష్ట్ర కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన ముదిరాజ్‌లకు మంత్రివర్గంలో అవకాశం దక్కడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న ఏకైక ముదిరాజ్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రిగా అవకాశం కల్పించి ముదిరాజ్ సామాజిక వర్గానికి న్యాయం చేయాలని దేవేందర్ కోరారు. సమావేశంలో నాయకులు పులి ప్రభాకర్ ముదిరాజ్, పొన్నం రాజు ముదిరాజ్, దండు చిరంజీవి ముదిరాజ్, నీరటి రాజు ముదిరాజ్, సింగారపు రామకృష్ణ ముదిరాజ్, గోనెల విజేందర్ ముదిరాజ్, పులి మహేష్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## సెలెక్ట్ మోటార్స్ మాన్‌సూన్ క్యాంపు

- సద్వినియోగం చేసుకోవాలి: జనరల్ మేనేజర్ మహేందర్‌రెడ్డి



క్యాంపును ప్రారంభిస్తున్న సీఐ సతీష్

రామన్నపేట: సెలెక్ట్ మోటార్స్ వర్క్‌షాపులో నిర్వహిస్తున్న మాన్‌సూన్ క్యాంపును వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ జనరల్ మేనేజర్ మహేందర్‌రెడ్డి కోరారు. ఈ క్యాంపును హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీష్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ క్యాంపులోని ప్రయోజనాలను వినియోగదారులు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రత్నాకర్‌రెడ్డి, నాగార్జున, సెలెక్ట్ మోటార్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# త్యాగానికి, విశ్వాసానికి ప్రతీక బక్రీద్



ప్రార్థనలో ఎమ్మెల్యే నాయిని, సిరిసిల్ల రాజయ్య



ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: బక్రీద్.. త్యాగానికి, విశ్వాసానికి ప్రతీక అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని హనుమకొండ పెద్దమ్మగడ్డలోని ఈద్గాలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యతో కలిసి ఎమ్మెల్యే శనివారం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ రాష్ట్రంలో మత సామరస్యాన్ని పరిరక్షిస్తూ అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని గుర్తుచేశారు.

**ఈద్గాను సందర్శించిన సీపీ**

హన్మకొండ చౌరస్తా: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని హనుమకొండ బొక్కలగడ్డలోని ఈద్గాను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ శనివారం సందర్శించారు. ఈద్గా వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించడంతో పాటు ప్రార్థనలు ప్రశాంతంగా జరిగేలా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సీపీ పలు సూచనలు చేశారు. అప్రమత్తంగా విధులు నిర్వహించాలని చెప్పారు. సీపీ వెంట హనుమకొండ ఏసీపీ నర్సింహరావు, సీఐలు సతీస్, సీతారెడ్డి ఉన్నారు.

## భక్తి ప్రపత్తులతో బక్రీద్ వేడుకలు



కాజీపేటలో సందేశం ఇస్తున్న మతపెద్ద ఇమామ్ మహబూబ్ రహమాన్



హసన్‌పర్తి: బక్రీద్ ప్రాముఖ్యాన్ని ముస్లింలకు వివరిస్తున్న ఇమామ్

కాజీపేట: సర్వమానవ సమైక్యత, సద్భావన, ప్రపంచానికి శాంతి సందేశం అందించిన ఇబ్రహీం ఖలీలుల్లాహ్ తన కుమారుడు ఇస్మాయిల్‌ను దైవానికి అంకితం చేయడానికి ప్రయత్నించిన పవిత్ర రోజైన బక్రీద్ పర్వదినాన్ని కాజీపేటలో ముస్లింలు శనివారం భక్తిప్రపత్తులతో ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని 15వేల మంది ముస్లింలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మేకలు, గొర్రెలను బలిఇచ్చి వాటి మాంసాన్ని పేదలకు పంపిణీ చేశారు. ముస్లింలు జామా మసీదుకు చేరుకుని సామూహిక ప్రార్థనలు చేశారు. మతపెద్ద ఇమామ్ మహబూబ్ రహమాన్ ప్రసంగిస్తూ సర్వమానవ సమైక్యత, శాంతికోసం ప్రతిఒక్కరూ కలిసిమెలసి జీవించాలని కోరారు. సీఐ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

**హసన్‌పర్తి మండలంలో..**

హసన్‌పర్తి: బక్రీద్ పర్వదిన వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తొలుత బక్రీద్ ప్రాముఖ్యత గురించి ఇమాంలు వివరించారు. హసన్‌పర్తి మండల కేంద్రంతో పాటు నాగారం, వంగపహాడ్, భీమారం, అర్వపల్లి, ఎల్లాపురం, మునిపల్లి, పెగడపల్లి, గోపాలపురం, గుండ్లసింగారం, పలివేల్పులల్లో ముస్లింలు ప్రత్యేక నమాజ్ పఠించారు. ఈ సందర్భంగా ముస్లింలు అలయ్, బలయ్ తీసుకుని పరస్పరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## ముస్లింల సంక్షేమానికి సర్కారు పెద్దపీట



ప్రార్థనలో పాల్గొని ముస్లింలతో కలిసి మాట్లాడుతున్న మురళీధర్‌రావు



ఏసీపీ నందిరామ్‌నాయక్‌ను సన్మానిస్తున్న ముస్లిం మతపెద్దలు

ఖిలా వరంగల్: ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు అన్నారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్ జంక్షన్‌లోని ఈద్గాలో కేర్‌టేకర్ ఎంఏకే తన్వీర్, ఈద్గా ప్రతినిధి ఎంఏ.జబ్బార్ ఆధ్వర్యంలో ఈద్గా మత గురువు మౌలానా మహ్మద్ నౌమన్ రాజా నేతృత్వంలో 25వేల మంది ముస్లింలు శనివారం ఉదయం సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. చార్‌బౌలి, ఎల్‌బీనగర్, శివనగర్, రంగశాయిపేట, శంభునిపేట, శాంతినగర్, ఏకశిల నగర్, కరీమాబాద్, చింతల్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ముస్లింలు తరలిచ్చి ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఒకరికొకరు అలయ్ బలయ్ చేసుకొని ప్రత్యేక శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముఖ్యఅతిథిగా కొండా మురళీధర్‌రావు హాజరై ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.కోటి వ్యయంతో ఈద్గా, మినార్ అభివృద్ధికి కట్టుబడి పనిచేయనున్నట్లు తెలిపారు. అనంతరం మురళీధర్‌రావును ఎంఏ జబ్బార్ సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్‌రాజు, మీసాల ప్రకాశ్, బాసాని శ్రీనివాస్, వెలుగం సత్యనారాయణ, వేణు, పగడాల సతీష్, శ్రీరాం రాజేష్, ముస్లింలు పాల్గొన్నారు.